## ముచ్చర్ల రజనీ శకుంతల




'హేవండీ...' క్వింటాళ్ళ కొద్దీ గోమును పెదవుల మీద మోస్తూ పిలిచింది భ్రమరాంబ.

'హబ్బా... ఎంత స్వీట్‌గా వుంది డాలింగ్ నీ పిలుపు' అన్నాడు ఉబ్బితబ్బిబ్బవుతూ బ్రహ్మానందం.

'మిమ్మల్ని చూస్తుంటే సినిమాల్లో కామెడీలు చేసే బ్రహ్మానందం గుర్తొస్తున్నాడండీ...' అంది అతనికి దగ్గరగా జరిగి.

గతుక్కుమన్నాడు బ్రహ్మానందం. 'నేరకపోయి ఆ పేరు పెట్టుకున్నానా...' అనుకున్నాడు. ఆ క్షణమే తనకా పేరు పెట్టిన తల్లిదండ్రుల మీద పీకల్దాక కోపం వచ్చింది.

'నీకా బ్రహ్మానందం గుర్తు రావడమేంటే... నేనెప్పుడూ నేనే... నువ్వు పతివ్రతవే... నేను తప్ప ఇంకెవరూ గుర్తురా కూడదు' నెత్తీనోరూ మొత్తుకొని చెప్పాడు బ్రహ్మానందం.

'యూ... మీరు మహా చిలిపి...' అంటూ రక్తం కారేలా బుగ్గమీద గిల్లింది సరసంగా.

'ఓర్నీ సరసాన్ని సంతకెత్తుకెళ్ళా. ఇంత గట్టిగా గిల్లుతావా...' మనసులో మొత్తుకొని పైకి మాత్రం... 'హిహి... హి' అని ఓ నవ్వు నవ్వాడు.

భ్రమర బ్రహ్మానందానికి ఇంకా దగ్గరగా జరిగి అతని క్కా గుండీల మీద చేయేసింది.

'ఛీ... నాకు సిగ్గేస్తోంది భ్రమరా... ఆఫీసుకెళ్ళే టైంలో బావోదేమో...' తన భార్య తన చొక్కా గుండీల మీద చేయేయడంతో మరోలా అనుకొని సిగ్గుపడుతూ అన్నాడు.

అంతే... ఫట్... ఫట్... ఫట్...మని గుండీలు లాగేసింది.

'ఏయ్... ఏం చేస్తున్నావే...' కంగారుగా బ్రహ్మానందం అనేలోగా చొక్కా గుండీలన్నీ ఫట్ ఫట్ మనే సౌండిస్తూ తెగిపోయాయి.

'వన్ సెకన్ ప్లీజ్' అంటూ గదిలోకి పరుగెత్తి నాలుగు సెకన్ల తర్వాత సూదీ దారంతో తిరిగొచ్చింది భ్రమరాంబ.

'ఇదేంటే...' దీనంగా మొహం పెట్టి అడిగాడు బ్రహ్మానందం.

'ఛీ... అందుకే మిమ్మల్ని సినిమాలు చూడమంటాను. సినిమాల్లో హీరో చొక్కాలకు గుండీ ఉండదు. అప్పుడేమో హీరోయిన్ సూదీ దారంతో వచ్చి... అలాగే వంటి మీద చొక్కా వుండగానే గుండీ కుడుతుంది. హీరో ప్రేమగా హీరోయిన్‌ని గుండెలకు హత్తుకుంటాడు. హూ... మీరూ వున్నారు... అలా చేయరు... కనీసం అలా నటించరు. సకే మీ చొక్కా గుండీలు పీకేసా...' అంది.

తలను గోడకేసి బాదుకోవాలన్న కోరికమన్నా... తన తల పగిలి రక్తం చిమ్మితే... హౌసోనర్ తన గోడకు మళ్ళీ వెల్ల వేయాలని డబ్బులు పీకుతాడని భయపడి ఊర్కున్నాడు.

భ్రమరాంబ మాత్రం తన్మయత్వంగా తను పీకి పారేసిన గుండీని తిరిగి, బ్రహ్మానందం చొక్కాకు కుడుతోంది. ఆ తన్మయత్వంలో పొరపాటున సూది బ్రహ్మానందం గుండెను ముద్దాడింది.

'చచ్చాన్రో' మొత్తుకున్నాడు బ్రహ్మానందం.

'హబ్బ... మరీ చోద్యం కాకపోతే... ఇంత చిన్న సూది గుచ్చుకుంటే... డెబ్బై కిలోల బరువున్న మీరు ఛస్తారా...' అంది.

బ్రహ్మానందానికి ఏడుపొక్కటే తక్కువైంది.

★★★

భ్రమరాంబ, బ్రహ్మానందం 'మేడ్ ఫర్ ఈచ్ అదరే... కాకపోతే భ్రమర తెలుగు సినిమాలు విపరీతంగా చూస్తుంది.

అందులో హీరో హీరోయిన్లు రొమాన్స్ ఎలా చేసుకుంటారో... పెళ్ళయ్యాక తనూ, తన భర్తా కూడా అలాగే చేసుకోవాలని 'పెళ్ళి' కాక ముందే డిసైడై పోయింది.

పెళ్ళయ్యాక అలా ట్రై చేసి చూసినా పాపం బ్రహ్మానందమనే జీవికి బొత్తిగా సినిమాటిక్ లవ్ అంటే పడలేదు.

అది తెలిసిన భ్రమరాంబ... కనీసం సినిమాటిక్‌గా నటించమని మొత్తుకుంది. భార్యంటే ప్రేమే... కానీ భార్య సినిమా చేష్టలు భరించలేక ఈ జీవి విలవిల్లాడుతున్నాడు.

ఆఫీసుకు వెళ్ళే హడావిడిలో వుంటాడు బ్రహ్మానందం. వెంటనే భ్రమర రంగప్రవేశం చేస్తుంది. గోముగా గోరుముద్దలు చేసి తినిపిస్తానంటుంది.

'నాకలా ఇష్టముండదే' అంటాడు బ్రహ్మానందం.

'నా ఖర్మకాలి మిమ్మల్ని చేసుకున్నా' అంటుంది ముక్కు చీదుతూ భ్రమరాంబ.

ఆ ముక్కు చీదుడు తన పెరుగన్నంలో ఎక్కడ కలిసిపోతుందోనని బిక్క చచ్చిపోతాడు బ్రహ్మానందం.

'పోనీ... అలా ఇష్టమున్నట్టు నటించండి' అంటుంది.

'కాదంటే నో పుడ్డు... కొసమెరుపుగా నో బెడ్డు' అంటూ బెట్టు చేస్తుంది.

చచ్చార్కుంటాడు బ్రహ్మానందం.

చిన్నచిన్న ముద్దలు చేసి తినిపిస్తూ ఉంటుంది.

'ఒసే... ఒసే... అవతల నాకు ఆఫీసు టైం అయిపోతుందే...' మొత్తుకుంటాడు బ్రహ్మానందం.

'వెధవాఫీసు... ముందు నన్ను ప్రేమగా తెలుగు సినిమా హీరోయిన్‌లా మీకు ముద్దులు కలిపి పెట్టనీయండి...' అంటుంది.

'హతవిధీ...' అని తల పట్టుకుంటాడు.

అప్పుడేమో భ్రమర... 'ఇది నా ముద్ద...' అంటూ చిన్న గోళీకాయ సైజులో అన్నం ముద్ద కలిపి బ్రహ్మానందం నోట్లో పెడుతుంది. సీరియస్ లుక్కూ, ప్లస్ ఏడుపు మొహమూ పెట్టుకొని ఆ ముద్ద మింగుతాడు.

'ఇదేమో... బుల్లి బ్రహ్మానందం ముద్ద...' అంటూ మరో ముద్ద పెడుతుంది.

'వాడెవడే...' బ్రహ్మానందం బిత్తరపోతాడు.

'హబ్బా... అందుకే తెలుగు సినిమాలు చూడమని మొత్తుకునేది. మీకు బొత్తిగా సినిమా జ్ఞానం లేదు. రేపో, మాపో మన కడుపులో పెరిగే బిడ్డ...' అంటుంది సిగ్గులొలకబోస్తూ.

'వార్నీ... నీకీ టాలెంట్లు కూడా ఉన్నాయా...' అనుకొని ఆ ముద్ద మింగుతాడు.

'ఇది మా నాన్నది... ఇది మీ నాన్నది... ఇది మీ అమ్మది... ఇది మా అమ్మది...' అలా పేరుపేరునా చెబుతూ చిన్నచిన్న గోళీకాయ సైజులో వున్న అన్నం ముద్దలు తినిపిస్తూ ఉంటుంది.

అంతే... అప్పుడు బ్రహ్మానందం ఆవేశానందమై... శివ తాండవం చేస్తాడు.

'థూ నీ యబ్బ జీవితం... దేశంలోని ఓటర్ల లిస్టు దగ్గర పెట్టుకుని... ఒక్కొక్కరి పేరు చెబుతూ ముద్దలు పెట్టవే... అప్పుడు గానీ నీ కోరిక తీరదు. ఆ ముద్దలన్నీ నింగేసరికి... నాకు ముసలితనం వస్తుంది...' కోపంగా అంటాడు.

'అవును సుమీ... నాకీ ఆలోచన రానే లేదు' అంటుంది.

అదీ భ్రమరాంబ కేరెక్టర్.

ఎట్టకేలకు బ్రహ్మానందం ఆ రోజు ఆఫీసుకు వెళ్ళాడు.

అతనికి ఎంతగా మెంటలెక్కిందంటే... ఆఫీసులో ఎవరైనా చొక్కాతో కనిపిస్తే వాళ్ళ గుండీలు పీకి, సూది, దారం తీసుకొని తనే కుట్టాలన్నంతగా...

పెళ్ళయి నెల కాకుండా ఫిఫ్టీ పర్సెంట్ తనకు

మెంటలెక్కిందని నిశ్చయానికొచ్చాడు బ్రహ్మానందం.

★ ★ ★

ఆ రోజు రాత్రి.

వెన్నెల విరగబూస్తోంది.

భ్రమా... మాంఛి మూడ్‌లో ఉన్నాడు బ్రహ్మానందం.

'బ్రహ్మీ... ఎంత బాగా పిలిచావు నా పేరును... అచ్చు మల్లెపూవులో శోభన్‌బాబు పిలిచినట్టు' అంది భ్రమరాంబ.

బ్రహ్మానందానికి చిర్రెత్తుకొచ్చింది. అయినా తమాయించుకున్నాడు.

అవసరం తనది, పైగా చలి చంపేస్తోంది.

★ ★ ★

బ్రహ్మానందం గుండెల మీద తల పెట్టింది భ్రమర.

ఇప్పుడీ సీన్ అవసరమా? నీ బరువంతా నా మీద పెట్టి, ఇలా గుండెల మీద తలపెట్టాలా?' అడిగాడు బ్రహ్మానందం.

'అబ్బ... సినిమాల్లో హీరో గుండెల మీద హీరోయిన్ తలపెట్టి... అతని ఛాతీ మీద వెంట్రుకలను వేలితో ఇలా... ఇలా...' అంటూ...

'చచ్చాన్రో నా పెళ్ళామా?...' 'గట్టిగా అరిచాడు బాధ భరించలేక.

'ఏమైందండీ...' అంది కంగారుగా మంగళసూత్రం కళ్ళకు అద్దుకొని.

'నాకున్నవే ఛాతీ మీద ముష్టి మూడు ముదనష్టపు వెంట్రుకలు. ఎందుకే అలా పీకావు... మంట పుట్టి ఛస్తున్నా...'

'అవున్లెండి... సెలూన్‌లో కత్తితో పరపరా గీస్తే పర్లేదు గానీ, పెళ్ళాం ప్రేమతో ఓ ఛాతీ వెంట్రుక పీకితే బాధేస్తుందా? అసలు నేనంటే మీకు మోజు పోయింది లెండి' అంది ఏడుస్తూ.

బిక్క చచ్చిపోయాడు బ్రహ్మానందం.

అరగంటపాటు ఛాతీ మీద రుద్దుకుని భ్రమరని కన్విన్స్ చేసేసరికి మరో అరగంట పట్టింది. అతని మూడ్ అటకెక్కింది.

★ ★ ★

'ఏవండీ ప్లీజ్...' అంది.

'హేవిటే... నువ్వలా పిలిచావంటే నాకు మూడిందన్న మాటే. మళ్ళీ ఏం చేయాలి?' అడిగాడు భయంగా బ్రహ్మానందం.

'వెరీ సింపుల్... నన్నెత్తుకుని గిరగిరా తిప్పండి.'

విరుచుకు పడబోయి తమాయించుకున్నాడు.

'ఒసే... నీ బరువెంతో తెలుసా... డెబ్బై నాలుగు... నాది డెబ్బై... నిన్నెత్తుకొని గిరగిరా తిప్పలేనే... నన్ను క్షమించవే...' మొత్తుకున్నాడు బ్రహ్మానందం.

'అవున్లెండి... నేను కల్పనా రాయ్‌లా వుంటానని దెప్పి పొడుస్తున్నారు... అనండి... అనండి... ఏదో ఓ రోజు నేను మీ పేరు రాసి పెట్టి ఆత్మహత్య చేసుకుంటా...' అంది రాగాలు తీస్తూ.

'ఓర్నాయనో... నాకీ పనిష్మెంట్ ఏంట్రా' అనుకొని, తప్పనిసరి పరిస్థితిలో... బలమంతా కూడదీసుకుని, అరకిలో బాదంపిస్తా తిని... భ్రమరని ఎత్తుకునే ప్రయత్నం చేస్తూ... చివరాఖరికి అతికష్టమ్మీద ఎత్తుకొని... గిరగిరా తిప్పలేక కళ్ళు తిరిగి పడిపోయాడు.

బ్రహ్మానందం గుండెల మీద తల పెట్టింది భ్రమర.

ఇప్పుడీ సీన్ అవసరమా? నీ బరువంతా నా మీద పెట్టి, ఇలా గుండెల మీద తలపెట్టాలా?' అడిగాడు బ్రహ్మానందం.

'అబ్బ... సినిమాల్లో హీరో గుండెల మీద హీరోయిన్ తలపెట్టి... అతని ఛాతీ మీద వెంట్రుకలను వేలితో ఇలా... ఇలా...' అంటూ...

'చచ్చాన్రో నా పెళ్ళామా?...' 'గట్టిగా అరిచాడు బాధ భరించలేక.

'ఏమైందండీ...' అంది కంగారుగా మంగళసూత్రం కళ్ళకు అద్దుకొని.

అతని మీద భ్రమర.

ఎ.ఆర్.రెహమాన్ మ్యూజిక్ వినిపించిందా గదిలో.

బ్రహ్మానందం నడ్డి ఆ విధంగా విరిగింది.

★ ★ ★

'హేవండీ... నేను పాపిష్టిదాన్ని... నన్ను క్షమించండి...' అంది కళ్ళొత్తుకుంటూ భ్రమరాంబ.

'హమ్మ... ఛఛ... అదేం లేదే... హబ్బా... నువ్వు మాత్రం ఏం చేస్తావే...' అన్నాడు. తన బాడీలో ఏ పార్టు ఏమైందోనన్న ఆందోలన ఓవైపు పీకుతూనే వున్నా.

'హేవండీ... మీరు మెల్లిగా లేచి, చేతిలో కర్ర సాయంతో నడుస్తూ నా దగ్గరకి రండి. పొరపాటున మీ చేతి కర్ర కింద పడుతుంది. మీరు కింద పడబోతారు. నేనొచ్చి పట్టుకుంటాను' అంది సినిమాలోని ఓ సీన్ కళ్ళ ముందు మెదిలేసరికి.

ఇప్పుడు ఇళయరాజా మ్యూజిక్‌లో వెనక్కి విరుచుకు పడిపోయాడు బ్రహ్మానందం.

★ ★ ★

'చూడండి భ్రమరాంబగారూ... మీ ఆయన నడ్డి విరిగింది. మోకాళ్ళలో వున్న మెదడుకు తెలుగు సినిమా కేన్సర్ సోకింది. మీ ఆయన కళ్ళకు వినికిడి శక్తి, చెవులకు చూసే శక్తీ పోయింది. పొరపాటున మీరు తెలుగు సినిమా డైలాగులు ఆయన ముందు మాట్లాడినా, అలా నటించినా... వెంటనే ఆయన చచ్చూర్కుంటాడు. తెలుగు సినిమా సెల్స్ ఆయన బాడీలోని రక్తకణాలను మర్డర్ చేసి పారేస్తాయి. ఆనక మీ ఇష్టం. మీ ఆయన ఖర్మం. అప్పుడు నువ్వాయన బాడీ మీద పడి ఏడ్వాలి.

ఇక నుండి ఏ మాత్రం సినిమా భాష వాడొద్దు. ఆయన్ని జాగ్రత్తగా చూసుకోండి' చెప్పాడు డాక్టర్ సంబరంగా భలే బకరా దొరికిందని చంకలు గుద్దుకుంటూ.

కళ్ళకు రేబాన్ తగిలించుకుని ఇంటికి బయల్దేరాడు బ్రహ్మానందం ఓ విషాదమైన ఎక్స్‌ప్రెషనిస్తూ.

★ ★ ★

రోజూ ఆఫీసుకు వెళ్తున్నాడు, వస్తున్నాడు. భ్రమరతో మామూలుగానే ఉంటున్నాడు. భ్రమర సినిమా [illegible] మాట్లాడినా, సినిమా టైప్‌లో ప్రవర్తించినా... మె[illegible] పట్టుకొని 'గుండె నొప్పి' అని అరుస్తున్నాడు.

భ్రమరాంబ ఇప్పుడు పూర్తిగా మారిపోయింది.

సినిమా టైప్‌లో నటించమని మొగుడ్ని పీక్కు తినడం లేదు. అయినా ప్రేమగానే ఉన్నారు. మనలో మాట... ప్రేమంటే... ప్రేమగా వుండాలంటే నటించనవసరం లేదు.

కానీ, భార్యకు బుద్ధి చెప్పడానికి బ్రహ్మానందానికి నటించక తప్పలేదు. భ్రమర పూర్తిగా మారిందని కన్‌ఫర్మ్ అయ్యేవరకూ నటించక తప్పదు. ఆ ఐడియా చెప్పి తనని కాపాడిన డాక్టర్‌కు మనసులోనే థాంక్స్ చెప్పుకున్నాడు బ్రహ్మానందం.

★

## రచయితలకు సూచనలు

**ఆదివారం ఆంధ్రభూమికి తమ రచనలు పంపేవారు ఈ కింది సూచనలను విధిగా పాటించాలి.**

★ రచయితలు తమ రచనలు పంపే కవర్లపై 'ఆదివారం ఆంధ్రభూమి' అని పేర్కొంటూ, శీర్షిక పేరు కూడా రాయాలి.

★ విలువైన ఫొటోలు, సమాచారం ఉన్న కవర్లను కొరియర్ ద్వారా పంపితే మంచిది.

★ ఆసక్తికరమైన సచిత్ర వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది.

★ పేపర్ కటింగ్‌లు కాకుండా వీలయినంత వరకు ఒరిజినల్ ఫొటోలే పంపాలి.

★ ప్రచురించిన ప్రతి ఆర్టికల్‌కు తగిన పారితోషికం ఉంటుంది కనుక రచయితలు తమ చిరునామాను స్పష్టంగా తెలియజేయాలి.

★ కథలు అచ్చులో రెండు పేజీలకు మించరాదు.

★ వివిధ అంశాలకు సంబంధించిన వ్యాసాలన్నీ రెండు అరఠావులకు మించకుండా ఉంటే మంచిది.

★ వినేసిన జోక్‌లు, చూసేసిన కార్టూన్లు కాకుండా కొత్త వాటినే పంపాలి.

★ వివిధ పత్రికల నుంచి సేకరించే అనువాదాల విషయమై వచ్చే వివాదాలకు రచయితలే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

రచనలు పంపాల్సిన చిరునామా

**ఎడిటర్,**

**ఆంధ్రభూమి (ఆదివారం అనుబంధం)**

**36, సరోజినీ దేవి రోడ్, సికిందరాబాద్.**